


సదస్సులో స్టాళ్లను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

భారత అంతరిక్ష పరిశోధక విభాగానికి
అండగా ఉంటాం

ఎయిరోడెఫ్‌కాన్ సదస్సులో సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధక విభాగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పరి శ్రమ లకు అను మైన రాష్ట్రంగా ప్రపంచ దేశాలకు ఎలుగెత్తి చాటేవిధంగా ఉత్పాదక రంగంలో తమిళనాడు అగ్రస్థానంలో ఉందని సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో మంగళవారం ఉదయం రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఆధ్వర్యంలో 'ఎయిరో డెఫ్‌కాన్'25' పేరుతో నిర్వహించిన అంతరిక్ష భద్రతాపరమైన పరిశ్రమలకు సంబంధించిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. వివిధ స్టాళ్లలో ఏర్పాటు చేసిన అంతరిక్ష భద్రతా పరికరాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. పారిశ్రామికంగా భారతదేశాన్ని ఆకర్షించే రాష్ట్రంగా తమిళనాడును ప్రపంచదేశాలన్నీ ఆకర్షించే విధంగా, బహుళజాతి సంస్థలకు చెందిన పరిశ్రమలు నెలకొల్పే విధంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. ఉత్పాదక రంగంలో రెండంకెల 11.19 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిన ఏకైక రాష్ట్రంగా తమిళనాడు మారిందని చెప్పారు. రాష్ట్రంలోని రక్షణ పారిశ్రామిక కారిడార్ భవిష్యత్తులో ప్రధాన పాత్ర పోషించనుందని దీనికి నిదర్శనమే రూ.23వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామన్నారు. చెన్నై సమీపంలోని వల్లమ్ వద్ద ఎయిరో హబ్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాబోతోందని తెలిపారు. కోయంబత్తూరు వరపట్టిలో 360 ఎకరాల్లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ పార్కును నిర్మిస్తున్నామని, విమానాల మరమ్మతులు, నిర్వహణకు కోయంబత్తూరు సూలూరు వద్ద 200 ఎకరాల్లో స్పేస్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో మంత్రులు దామో అన్బరసన్, టీఆర్బీ రాజా, ఎ మ్మెల్యే ఇ.కరుణానిధి, సముద్రతీర భద్రతాదళం ప్రధానాధికారి పరమేష్ శివమణి, భద్రతా పరిశోధన అభివృద్ధి సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ పీకే దాస్, రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహ వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, రాష్ట్ర మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తరేష్ అహమ్మద్, టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి, బీసీఐ ఎయిరో స్పేస్ సీఈఓ స్టీఫెన్ కాస్టెట్, ఎయిర్ కమాండర్ శర్మ, భద్రతా పరిశోధన అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు ఎస్ క్రిస్టోఫర్, గిల్ ఇండియా ఛైర్మన్ బాలసుబ్రమణియన్, భారత నావికాదళం అధికారి సతీష్ షినాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తుల ప్రదర్శన...

ఈ సదస్సులో 19 దేశాలకు చెందిన 300 సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. బోయింగ్, ఎయిర్‌బస్, లాక్‌హీడ్ మార్టిన్, దసో ఏవియేషన్, హెచ్ఏఎల్, భెల్, ఎల్ అండ్ టీ డిఫెన్స్ రోల్స్ రాయిస్, సఫ్రాన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ప్రముఖ సంస్థలు, కేంద్రప్రభుత్వ సంస్థలైన డీఆర్‌డీఓ, ఇస్రో, బీడీఎల్, ఏవీఎన్ఎల్ కూడా తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచాయి. ఐఐటీ మద్రాస్, ఎస్ఆర్ఎం,అన్నా విశ్వవిద్యాలయం, మాడెల్ట్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ తదితర విద్యా, పరిశోధన సంస్థల ప్రతినిధులు కూడా సదస్సులో పాల్గొన్నారు.

శ్రీలంక తమిళులకు 772 నివాస గృహాలు...

చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం సర్వజన పునరావాస శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో విరుదునగర్, తిరువణ్ణామలై, తూత్తుకుడి, శివగంగ జిల్లాల్లోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాల్లో రూ.44.48 కోట్లతో నిర్మించి, రూ.6.58 కోట్లతో కనీస సదుపాయాలు సమకూర్చిన 772 నివాసగృహాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, ఎస్ఎం నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, ప్రజాపనుల శాఖ కార్యదర్శి రీటా హరీష్ తక్కర్, ప్రవాస తమిళుల సంక్షేమ, పునరావాస శాఖ కమిషనర్ ఎం.వళ్లలార్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యుత్ చార్జీల మోత నుంచి బయటపడేందుకు

ప్రభుత్వ కార్యాలయాలపై
సౌరవిద్యుత్ ప్యానళ్లు

● తొలివిడతగా నాలుగు జిల్లాల్లో ఏర్పాటు
● రాష్ట్రప్రభుత్వం నిర్ణయం

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల నుంచి బయటపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల్లోకి దిగనుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలపై సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా తొలివిడతగా నాలుగు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లలో సోలార్ ప్యానళ్లు అమర్చేలా గత ఏడాది 'ప్రధాన మంత్రి సూర్యోదయ' పేరుతో చేపట్టిన ప్రాజెక్ట్‌ను పీఎం మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. అలాగే, దేశవ్యాప్తంగా విద్యుత్ చార్జీలు తగ్గించేలా ఇళ్లు,ప్రైవేటు కార్యాలయాలు, కేంద్రప్రభుత్వ కార్యాలయాల్లో సౌరవిద్యుత్ వినియోగం చేపడుతున్నారు. రాష్ట్రంలో ఏడాది పొడవునా సౌరశక్తి విద్యుత్ ఉత్పత్తి చేసే వాతావరణం నెలకొని ఉంది. ఈ కారణంగా, సౌరశక్తి విద్యుదుత్పత్తి కేంద్రాలు, విద్యుత్ వాహనాల ఉత్పత్తి, విక్రయాలు అధికంగా కాగా, విద్యుత్ వాహనాలకు బ్యాటరీ తయారీ సంస్థలు ఏర్పాటవుతున్నాయి. ఈ క్రమంలో, తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై 30 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే పేరుకుపోయిన బకాయిల వసూలు తమిళనాడు విద్యుత్ బోర్డుకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సౌరవిద్యుత్ వినియోగించడం ద్వారా విద్యుత్ చార్జీలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



250 పాఠశాలలపై...

ఈ విషయమై తమిళనాడు విద్యుత్ క్రమబద్ధీకరణ, పంపిణీ సంస్థకు చెందిన ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ... రాష్ట్రంలో తమిళనాడు ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా 250పాఠశాలలపై మొత్తం1.5 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సౌరశక్తి విద్యుదుత్పత్తికి అవసరమైన పరికరాలు సిద్ధం చేసినా, పర్యవేక్షణ లోపం కారణంగా నిరుపయోగంగా ఉన్నాయన్నారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో 200 మెగావాట్ల సౌరశక్తి విద్యుదుత్పత్తి చేయాలని ప్రాజెక్ట్ రూపొందించామన్నారు. తొలివిడతగా చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్ జిల్లాల్లో 40 మెగావాట్ల ఉత్పత్తికి సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించామని తెలిపారు.సౌరవిద్యుత్ ఏర్పాటుకు చెన్నై కార్పొరేషన్‌లో 105ప్రాంతాలు గుర్తించగా,మిగిలిన జిల్లాల్లో ప్రాంతాలను ఎంపిక చేపట్టినట్లు తెలిపారు. సౌరవిద్యుత్ వినియోగంతో విద్యుత్ చార్జీలు 40 నుంచి 50 శాతం తగ్గే అవకాశముందని వివరించారు.



పోలీసుల అదుపులో నిందితులు

ఏనుగు దంతం విక్రయానికి యత్నం

● ఐదుగురి అరెస్ట్

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దంతం విక్రయించేందుకు యత్నించిన ఐదుగురిని తేని జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. బోడినాయకనూర్ జమీందారు కుటుంబీకుడైన వడమలై రాజపాండ్యన్‌కు చెందిన 1.6 మీటర్ల పొడవైన భారీ ఏనుగు దంతాన్ని విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, తేని, మదురై జిల్లాల్లో అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి వివిధ ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. మదురై జిల్లా వళర్‌నగర్ ప్రాంతంలో ఓ కారును తనిఖీ చేయగా, ఏనుగు దంతం కనిపించింది. ఆ వాహనంలో ఉన్న మణికంఠన్, సుధాకర్, రఘునాథ్, సుబ్రమణి, రమేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. ఏనుగు దంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏనుగుదంతం యజమానిగా భావిస్తున్న వడమలై రాజపాండ్యన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కూటమిని పటిష్ఠ పరచడం ఎలా?

● ఈపీఎస్ నివాసంలో బీజేపీ నేతల మంతనాలు

చెన్నై, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ఇక ఆరు మాసాల గడువే ఉండటంతో రాష్ట్రంలో ఎన్డీఏని బలపరిచే దిశగా బీజేపీ జాతీయ నాయకులు చర్యలకు ఉపక్రమించారు.అధికార డీఎంకేను ఎదుర్కోవడంపై ఆ కూటమి నేతలు సన్నాహాలు చేపడుతున్నారు. ఇప్పటికే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి 50 నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తి చేశారు. ఈ నేపథ్యంలోనే కూటమిలోకి కొత్త పార్టీలను చేర్చుకునే విషయమై చర్చలు జరిపే నిమిత్తం బీజేపీ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జీలు జయంత్‌పాండా, మురళీధర్ మేహాల్, రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, ఉపాధ్యక్షుడు ఆర్ఎన్ జయప్రకాష్ తదితరులు మంగళవారం ఉదయం స్థానిక అడయార్ గ్రీన్‌వేస్ రోడ్డులోని ఈపీఎస్ నివాసానికి వెళ్లారు. అక్కడ నేతలు సుమారు ముప్పావు గంట చర్చించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వ్యూహరచనపై కూడా చర్చించారు. వన్నియార్ల ఓటు బ్యాంక్ మెండుగా కలిగిన పీఎంకేని, అదే విధంగా డీఎండీకేని కూటమిలో చేర్చుకునే విషయంపై నేతలు చర్చించినట్లు తెలిసింది. అయితే పీఎంకే తండ్రీకొడుకుల వర్గాలుగా చీలిపోయినందున ఆ అపవాదు తమపైకి రాకుండా అడుగులు వేయాలని నేతలు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.



ఈపీఎస్‌తో నయినార్ నాగేంద్రన్, జయంత్‌పాండా తదితరులు



అపోలో ఆస్పత్రిలో రాందాస్‌ను పరామర్శిస్తున్న ఉదయనిధి

రాందాస్, వైగోకు డిప్యూటీ సీఎం ఉదయనిధి పరామర్శ

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో చికిత్సలందుకుంటున్న పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను, ఎండీఎంకే నేత వైగోను డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి మంగళవారం ఉదయం పరామర్శించారు. రాందాస్ కుటుంబ సభ్యులు, ఎంపీ ఆర్.సుధ, శాసనసభ్యులు జీకే మణి, ఇరా అరుళ్‌ను కలుసుకుని రాందాస్ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇదే విధంగా మరో విభాగంలో చికిత్స పొందుతున్న వైగోనూ కూడా ఆయన పరామర్శించారు. అటు పీమ్మట మక్కల్ నీదిమయ్యం నాయకుడు, కమల్ కూడా అపోలో ఆస్పత్రికి వెళ్లి రాందాస్‌ను పరామర్శించారు. ఆస్పత్రి వెలుపల కమల్ మాట్లాడుతూ రాందాస్ ఆరోగ్యం కుదుటపడిందని, మంగళవారం సాయంత్రం డిశ్చార్జ్ అవుతారని తెలిపారు. ఆ ప్రకారమే రాందాస్ సాయంత్రం 6గంటలకు డిశ్చార్జ్ అయ్యి కారులో దిండివనానికి బయలుదేరారు. ఆ సందర్భంగా రాందాస్ మీడియాతో మాట్లాడుతూ... వైద్యులు ఇంటి పట్టునే విశ్రాంతి తీసుకోవాలని సూచించారన్నారు. తాను పార్టీ వ్యవహారాలను చక్కదిద్దాల్సి ఉండటంతో విశ్రాంతి తీసుకునే ప్రసక్తి లేదని నవ్వుతూ చెప్పారు.

'గో కలర్స్'పై ఐటీ పంజా

● షోరూంలు, కార్యాలయాలు సహా 30 చోట్ల సోదాలు

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ వస్త్ర దుకాణాలు కలిగిన 'గో కలర్స్' షోరూంలు, కార్యాలయాలు సహా 30 ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు మంగళవారం ఉదయం సోదాలు జరిపారు. ఏడాదికి రూ.850 కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన ఈ సంస్థ గత కొన్నేళ్లుగా భారీస్థాయిలో పన్నుల ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో స్థానిక నుంగంబాక్కంలోని ఆదాయపు పన్నుల శాఖ ప్రధాన కార్యాలయం నుంచి 10కి పైగా కార్లలో సుమారు 50 మంది అధికారులు ఆ సంస్థకు చెందిన 30 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సోదాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకూ కొనసాగాయి. స్థానిక ఆర్ఏ పురంలో ఉన్న గో కలర్స్ యజమాని నివాసంలోనూ పదిమంది ఐటీ ఆఫీసర్లు తనిఖీలు నిర్వహించారు. ఇదే విధంగా ఈరోడ్, కోయంబత్తూరు నగరాల్లోనూ గో కలర్స్ సంస్థతో సంబంధం ఉన్న ప్రాంతాల్లో ఐటీ అధికారులు ముమ్మర సోదాలు జరిపారు. గో ఫ్యాషన్ సంస్థకు అనుబంధంగా ఉన్న గో కలర్స్ సంస్థలో అక్రమ నగదు బట్వాడా అధికంగా జరిగినట్లు ఆరోపణలు రావడంతో వాటిపై విచారణ జరిపేందుకుగా ఈ దాడులు జరిపినట్లు తెలుస్తోంది. నుంగంబాక్కంలోని ఉన్న గో కలర్స్ షోరూం, గ్రీన్‌వేస్ రోడ్డులోని పలు అంతస్థుల భవనంలో నివసిస్తున్న సంస్థ యజమాని కార్యాలయం, నివాసంలో ఒకే సమయంలో దాడులు జరిగాయి. ఈ సోదాల్లో పన్ను ఎగవేతకు సంబంధించిన కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నట్లు ఐటీ అధికారులు చెబుతున్నారు. ఈ దాడులకు సంబంధించిన అధికారిక ప్రకటనను త్వరలో విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.



మీకు అండగా ఉంటా... త్వరలో కలుస్తా

● కరూర్ మృతుల కుటుంబాలకు విజయ్ వీడియో కాల్‌లో ఓదార్పు

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): 'ఊహించలేనిది జరిగింది... ఏ రకంగానూ మీ నష్టాన్ని భర్తీచేయలేం... ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటా... త్వరలోనే మిమ్మల్ని కలుసుకుంటా' అంటూ కరూర్ మృతుల కుటుంబాలకు తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ఓదార్చారు. విజయ్ గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సీటీ నిర్మల్ కుమార్ తదితరులపై కేసు నమోదు చేశారు. వారిద్దరు ముందస్తు బెయిలు కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఘటనకు సంబంధించి కరూర్ జిల్లా టీవీకే కార్యదర్శి మదియళగన్‌ను అరెస్ట్ చేశారు. 41 మంది మృతిచెందిన ఘటనపై విజయ్ గత వారం ఆవేదనతో వీడియో విడుదల చేశారు. అలాగే, మృతుల కుటుంబాలకు తలా రూ.20 లక్షలు అందిస్తానని, మృతుల కుటుంబాలను త్వరలోనే కలుసుకుని ఓదార్చుతానని కూడా ప్రకటించారు. ఈ క్రమంలో, సోమవారం రాత్రి కరూర్ మృతులకు సంబంధించిన కొంతమందికి వీడియో కాల్ చేసిన విజయ్.. వారిని పరామర్శించారు. మృతుల్లో ఒకరైన ధనుష్‌కుమార్ తల్లి, సోదరితో వీడియో కాల్‌లో మాట్లాడిన విజయ్... 'జరగకూడని ఘటన జరిగింది, ఏ రూపంలోనూ మీకు జరిగిన నష్టం పూడ్చలేం, ఎల్లప్పుడు మీ కుటుంబానికి అండగా ఉంటా, త్వరలో మిమ్మల్ని కలుస్తా' అంటూ ఓదార్చారు. ధనుష్‌కుమార్ కుటుంబ సభ్యులతో విజయ్ సుమారు 20 నిమిషాలు మాట్లాడారు.

మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక

● కరూర్ ఘటనపై దర్యాప్తు కోసం అరుణా జగదీశన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ వివరాలను అధికారిక గెజిట్‌లో ప్రచురించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఈ ఏకసభ్య కమిషన్ మూడు నెలల్లో దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని గెజిట్‌లో పేర్కొన్నారు.

'కరూర్'పై సీబీఐ విచారణ

● సుప్రీంకోర్టులో బీజేపీ పిటిషన్

కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ బీజేపీ నాయకురాలు ఉమా ఆనందన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌పై ఈనెల 10న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఈ ఘటనపై న్యాయవిచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటుచేసింది. అదేవిధంగా మద్రాసు హైకోర్టు ఆదేశాలతో ఐజీ అస్రా కార్గ్ నేతృత్వంలోని 'సిట్' ఏర్పాటైంది. కాగా, ఈ ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలని టీవీకే తరఫున దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిన విషయం తెలిసిందే.

ఘటన జరిగాక ఎవరినీ నిందించలేం

● సీనియర్ నటి అంబిక



ఘటన జరిగిన తర్వాత ఎవరినీ నిందించడంలో అర్థం లేదని సీనియర్ నటి అంబిక అన్నారు. కరూర్ వేలుచ్చామిపురంలో గత నెల 27న విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని సీనియర్ నటి అంబిక మంగళవారం పరిశీలించి చుట్టుపక్కల వారితో మాట్లాడారు. అనంతరం అంబిక మీడియాతో మాట్లాడుతూ.. 'ఘటన జరిగిన వెంటనే వచ్చి బాధితులను పరామర్శించాలని అనుకున్నా. నేను ఈ ప్రాంతానికి రావడంలో ఎలాంటి రాజకీయం లేదు. ఎవరికో మద్దతుగానో, వ్యతిరేకంగా మాట్లాడేందుకు రాలేదు. పిల్లలను తీసుకొచ్చి తల్లిదండ్రులు తప్పుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకూడదు. సభలకు వెళ్లే ప్రజలు, అభిమానులు జాగ్రత్తలు పాటించాలి' అని అన్నారు.

సమాచార దృష్టి

మైనార్టీ విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సాయం

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ వర్గానికి చెందిన ముస్లిం విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్టు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ పేర్కొన్నారు. 2025-26వ విద్యా సంవత్సరంలో పీజీ చదివేందుకు 'క్యూఎస్' ర్యాంకుల జాబితాలో తొలి 250 స్థానాల్లో ఉన్న విశ్వవిద్యాలయాల నుంచి అడ్మిషన్ ఉత్తర్వులు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను పరిశీలించి 10 మందిని ఎంపిక చేసి తలా రూ.30 లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. www.bcm-bcmw.tn.gov.in/-welfschemes_minorities.htm నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 31వ తేదిలోపు 'కమిషనర్, మైనార్టీ సంక్షేమ శాఖ, కలస మహల్ పారంపర్య భవనం, మొదటి అంతస్తు, చెన్నై-600005' చిరునామాకు పంపించాల్సి ఉంది.

దీపావళికి 30 శాతం అదనపు విక్రయాలు : ఆవిన్

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఈ ఏడాది 30శాతం విక్రయాలు పెంచేలా అదనంగా 180టన్నుల స్వీట్లు తయారు చేయనున్నట్లు ఆవిన్ అధికారులు తెలిపారు. అంబత్తూర్, మాధవరం, షోలింగనల్లూర్ తదితర పాల డిపోల్లో స్వీట్లు, కారం రకాలు తయారీ చేపట్టామన్నారు. మైసూర్‌పాక్ 250 గ్రాములు రూ.140, 500 గ్రాములు రూ.270, పాలకోవా 250 గ్రాములు రూ.130, 500 గ్రాములు రూ.250, నెయ్యి 100 మి.లీ రూ.80, 500 మి.లీ రూ.345, లీటరు రూ.660కి విక్రయిస్తున్నామన్నారు. జీఎస్టీ తగ్గింపుతో లీటరు నెయ్యిపై రూ.40 తగ్గిందని తెలిపారు. ఇవి మినహా మిల్క్ కేక్, మిల్క్ పేడా, రసగుల్లా, గులాబ్‌జాం, బేరీచ్చం కోవా తదితర స్వీటు రకాలు రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నామన్నారు.

కాచిగూడ - చెంగల్పట్టు, పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీ

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ-చెంగల్పట్టు, పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక స్లీపర్ క్లాస్ బోగీ నిలిపివేసి, బదులుగా 'ఏసీ' బోగీ అనుసంధానం చేయనున్నట్టు దక్షిణ రైల్వే పేర్కొంది. కాచిగూడ - చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 6నుంచి, కాకినాడ పోర్ట్ - చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 7నుంచి, కాచిగూడ - పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 5నుంచి, కాకినాడ పోర్ట్-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు డిసెంబరు 8 నుంచి స్లీపర్ బోగీ నిలిపివేసి, టూ టైర్ ఏసీ బోగీ అనుసంధానం చేయనున్నారు.

కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

అడయార్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కెవిన్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఎబిలిటీ ఫౌండేషన్ సంయుక్తంగా 24వ ఎడిషన్ కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డులు 2026 కోసం నామినేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచిన దివ్యాంగులను ఎంపిక చేసి వారిని ప్రత్యేకంగా సన్మానించి అవార్డులను ప్రదానం చేస్తుంటారు. 2003లో ప్రారంభమైనప్పటి నుంచి ఈ అవార్డులను దేశవ్యాప్తంగా 101 మందికి ప్రదానం చేశారు. ప్రస్తుతం 'ది కెవిన్ కేర్ ఎబిలిటీ ఫర్ ఎమినెన్స్', 'ది కెవిన్‌కేర్ ఎబిలిటీ మాస్టరీ అవార్డు' విభాగాల్లో నామినేషన్లను స్వీకరించనున్నారు. అవార్డు గ్రహీలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను బహూకరిస్తారు. కాగా, నామినేషన్లను ఈ నెల 30వ తేదీలోపు "www.abilityfoundation.org', "www.cavinkare.com' లకు చేరవేయాల్సి ఉంటుంది. వివరాల కోసం నెం.9840055848 సంప్రదించవచ్చు.

జెయింట్ వీల్ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మైదానాలు, పార్కుల్లో ఎత్తైన జెయింట్ వీల్ (భారీ రంగుల రాట్నం) ఏర్పాటుకు పర్యాటక శాఖ అనుమతులు తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కొద్దిరోజులుగా దేశంలోని పలు ప్రాంతాల్లో జెయింట్ వీల్‌లో తిరుగుతూ ప్రజలు జారిపడి గాయాల పాలైన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. అలాంటి ప్రమాదాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కొత్త జెయింట్ వీల్ ఏర్పాటుచేసే వారు సంబంధిత శాఖల నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందాల్సి ఉంది. తాత్కాలిక జెయింట్ వీల్ ఏర్పాటుచేసేవారు ఆరు నెలల్లో ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందాలి. అలాగే, పర్యాటక శాఖ అనుమతితో పాటు అగ్నిమాపక, ప్రజాపనులు, జలవనరుల శాఖల అనుమతులు పొందాల్సి ఉంది.

జనవరిలో కిలాంబాక్కం రైల్వేస్టేషన్ ప్రారంభం

ప్యారీస్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని కిలాంబాక్కంలో కొత్తగా నిర్మించిన రైల్వేస్టేషన్ జనవరిలో ప్రజలకు అందుబాటులోకి రానుందని దక్షిణ రైల్వే తెలిపింది. కోయంబేడులో ఉన్న బస్ టెర్మినల్‌లో రద్దీ పెరగడంతో ఇక్కడి నుంచి దక్షిణాది జిల్లాలకు నడుపుతున్న బస్సులను నగరశివారు ప్రాంతమైన కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి నడుపుతున్నారు. అయితే ఇక్కడ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్టాండు సమీపంలోనే రైల్వేస్టేషన్‌ను 400 మీటర్ల పొడవుతో 2 ప్లాట్‌ఫాంలతో నిర్మించారు. స్టేషన్‌లో ప్రయాణికుల విశ్రాంతి గది, స్టేషన్ మాస్టర్ కార్యాలయం తదితర పనులు తుది దశకు చేరుకున్నాయి. రైల్వేభద్రతా విభాగం అధికారుల పరిశీలన అనంతరం జనవరిలో పొంగల్ పండుగ సందర్భంగా ప్రారంభించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈనెల 8న బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగనుంది.ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు ప్రకటించింది. **తాంబరం:** సేలయూర్ క్యాంప్ రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, భారతి పార్క్ వీధి, కరణం వీధి, రాజా అయ్యర్ వీధి, మాతా ఆలయ వీధి, నెల్లూరమ్మన్ ఆలయ వీధి, పాలయాదన్ వీధి, న్యూ బాలాజీ నగర్ మరియు ఎక్స్‌టెన్షన్, లౌరా వీధి, అన్నై నగర్, ఎంఎస్‌కే నగర్, కన్నన్ నగర్, ఐటీబీ కాలనీ, ముత్తాలమ్మన్ ఆలయ వీధి, కుమరన్ వీధి, ఇళంగోవన్ ఆలయ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి. **చిట్లపాక్కం:** చిట్లపాక్కం మెయిన్ రోడ్డు, గణేశ్ నగర్, తిరుమగళ్ నగర్, మెహతా నగర్, రాజేశ్వరి నగర్, 100 అడుగుల రోడ్డు, సుందరం కాలనీ, చెల్లి నగర్, ఎళిల్ నగర్, అన్నై నగర్, ధనలక్ష్మి నగర్, విజయలక్ష్మి వీధి, సంతానలక్ష్మి వీధి. **ఆవడి:** శివశంకరాపురం, జాక్ నగర్, తెండ్రల్ నగర్, పద్మావతి నగర్, మూర్తి నగర్, రవీంద్ర నగర్, శ్రీ నగర్ కాలనీ, ముల్లై కురింజి వీధి, చోళన్ నగర్, సీటీహెచ్ రోడ్డు, కావరపాళయం, సింధు నగర్, ధనలక్ష్మి నగర్, ఎంఆర్ఎఫ్ నగర్, నసీర్ మెయిన్ రోడ్డు, మోజెస్ వీధి.

ప్రజలంతా డీఎంకే వైపే

● సమీక్షా సమావేశంలో ఎంపీ జగద్రక్షగన్



సమావేశంలో ఎంపీ జగద్రక్షగన్, ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా డీఎంకే వైపే ఉన్నారని ఎంపీ జగద్రక్షగన్ చెప్పారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో సోమవారం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ అధ్యక్షతలో మండల కార్యదర్శుల సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అరక్కోణం ఎంపీ జగద్రక్షగన్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల అభిప్రాయాలను, సలహాలను సేకరించేలా ఇంటింటి సర్వే చేపట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే నేతలంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారాన్ని చూపేలా చర్యలు చేపడుతున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకాలు అమలుపరచడంలో డీఎంకే ప్రభుత్వం ముందుందన్నారు.

కోవై ఫ్లైఓవర్‌కు జీడీ నాయుడు పేరు: సీఎం స్టాలిన్

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ అవినాశి రోడ్డులో రూ.1,791 కోట్లతో నూతనంగా నిర్మించిన 10.1 కి.మీ ఫ్లైఓవర్‌కు శాస్త్రవేత్త జీడీ నాయుడు పేరు పెడుతున్నట్లు సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో పేర్కొన్నారు. 2020లో ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు ప్రకటించి, 2021 మే నెల వరకు 5 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. అనంతరం అధికారం చేపట్టిన ద్రావిడ మోడల్ ప్రభుత్వం ఫ్లై ఓవర్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రూ.1,791 కోట్లతో 10.10 కి.మీ ఫ్లై ఓవర్ పనులు 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కోవై ప్రజల దీర్ఘకాలిక కోరికగా ఉన్న అవినాశి ఫ్లైఓవర్‌ను ఈనెల 9న ప్రారంభించనున్నామన్నారు. కోవై అంటేనే ఆవిష్కరణలకు ప్రసిద్ధి అని, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణలతో మనలను గర్వపడేలా చేసిన భారతదేశ ఎడిసన్ జీడీ నాయుడు పేరు ఈ ఫ్లై ఓవర్‌కు పెట్టడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఎక్స్‌లో తెలిపారు.

నాలుగు పార్కుల అభివృద్ధికి రూ.35 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూలాజికల్ పార్కు సహా నాలుగు ఉద్యానవనాల అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయిస్తూ ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వండలూరు జూలాజికల్ పార్క్, గిండి బాలల ఉద్యానవనం, సేలం కురుంబపట్టి జులాజికల్ పార్కు, వేలూరు అమృతి జులాజికల్ పార్కుల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.35 కోట్లు కేటాయించారని సచివాలయం తెలిపింది. అలాగే, జూల నిర్వహణ మెరుగుపరచాలని, వన్యప్రాణుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సచివాలయం తెలిపింది.

రాష్ట్రంలో పెరుగుతున్న డెంగ్యూ కేసులు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా డెంగ్యూ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఈశాన్య రుతుపవనాల ముందస్తు చర్యలు - అంటువ్యాధుల నిరోధక పనులపై ఆరోగ్య, పురపాలక నిర్వహణ, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో స్థానిక సచివాలయంలో మంగళవారం మంత్రి ఎం.సుబ్రమణ్యం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో గత జనవరి 1వ తేది నుంచి ఇప్పటివరకు 15,796 మంది డెంగ్యూ జ్వరం బారిన పడ్డారని, వారిలో 8 మంది మృతిచెందారని తెలిపారు. వారం రోజులుగా డెంగ్యూ వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో, రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలతో ప్రస్తుతం నియంత్రణలో ఉందన్నారు.

నీటికష్టాలు తీర్చండి

తిరుత్తణి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో నీటికష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తూ మహిళలు సోమవారం నిరసన చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని మాంబాక్కంలో వారంరోజులుగా తాగునీరు సరఫరా కాలేదని గ్రామస్తులు అధికారులకు విన్నవించుకున్నా.. ఫలితంలేకపోవడంతో సోమవారం ఉదయం మాంబాక్కంలోని నీటివనరులశాఖ కార్యాలయాన్ని బిందెలతో ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. అదేవిధంగా తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని వారు వాపోయారు. విషయం తెలుసుకున్న నీటి వనరులశాఖ అధికారులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామన్న హామీతో మహిళలు నిరసన విరమించుకున్నారు.

'చెన్నై వన్' యాప్‌తో లక్ష టిక్కెట్ల కొనుగోలు

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంటీసీ బస్సులు, మెట్రో, సబర్బన్ రైళ్లలో ఒకే టిక్కెట్టుతో ప్రయాణించేలా 'చెన్నై వన్' యాప్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరిచయం చేశారు. ఈ యాప్ పరిచయం చేసిన 15 రోజుల్లో ప్రయాణికులు లక్ష టిక్కెట్లు కొనుగోలు చేశారు. అలాగే, ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే వారి సంఖ్య కూడా పెరిగిందని అధికారులు తెలిపారు.

ఆరుగురు జిల్లా న్యాయమూర్తుల బదిలీ


చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు జిల్లా న్యాయమూర్తులను బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. వివాదాస్పద కాంచీపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సెమ్మల్ బదిలీ అయ్యారు. కాంచీపురం డీఎస్పీ శంకర్ గణేష్ అరెస్టుకు ఆదేశించడం ద్వారా వివాదంలో చిక్కుకున్న న్యాయమూర్తి సెమ్మల్, ప్రస్తుతం అరియలూరు శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మెన్‌గా నియమితులయ్యారు. అలాగే, చెన్నై కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి దీప్తి అరివునిధి, కాంచీపురం జిల్లా న్యాయమూర్తిగాను, దిండుగల్ జిల్లా అదనపు న్యాయమూర్తి వేల్‌మురుగన్, తంజావూరు జిల్లా ప్రిన్సిపల్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పుదుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె.చంద్రన్ మేట్టూరు అదనపు జిల్లా న్యాయమూర్తిగాను, తంజావూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పూర్ణ జయ ఆనంద్ పుదుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తిగాను, చెన్నై కుటుంబ సంక్షేమ అదనపు ప్రధాన న్యాయమూర్తి తేన్‌మొళి, తిరుపత్తూర్ జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సెంథిల్ బాలాజి మంత్రిగా బాధ్యతలు చేపట్టకూడదని చెప్పలేదు

సుప్రీం కోర్టు

అడయార్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజి మంత్రిగా బాధ్యతలు చేపట్టకూడదని తాము చెప్పలేదని, ఒక వేళ ఆయన మంత్రిగా ఉండాలని భావిస్తే పిటిషన్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. దివంగత జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సెంథిల్ బాలాజి రాష్ట్ర రవాణా శాఖమంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో రవాణా శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారనే అభియోగాలు నమోదైవున్నాయి. ఈ కేసు విచారణ సుప్రీంకోర్టులో సాగుతోంది. ఈ పిటిషన్ సోమవారం మరోమారు విచారణకు వచ్చింది. ఆ సమయంలో గతంలో తనను ఉద్దేశించి న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ సెంథిల్ బాలాజి తరపున ఒక పిటిషన్ దాఖలుకాగా, దీన్ని కోర్టు తోసిపుచ్చింది. అదే సమయంలో ఈ కేసు విచారణను ఢిల్లీకి ఎందుకు మార్చ కూడదు? అంటూ న్యాయమూర్తులు ప్రశ్నించగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది తమకు ఎలాంటి ఆక్షేపణ లేదని చెప్పారు.

'జీవా'ను సందర్శించిన కంచి పీఠాధిపతి



కమ్యూనిటీలో కంచి పీఠాధిపతి

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఇటీవల మహాబలిపురంలోని జీవా ఎలైట్ యాక్టివ్ రిటైర్మెంట్ కమ్యూనిటీని సందర్శించారు. అరుణ్ ఎక్సెల్లో ఎండీ పి.సురేష్ నేతృత్వంలో కమ్యూనిటీ విజయేంద్ర సరస్వతికి పూర్ణకుంభ స్వాగతం పలికింది. 2020 నుంచి 20 ఎకరాల ప్రాంగణంలో కొనసాగుతున్న కమ్యూనిటీలో 400 మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారు. నివాసితుల ఆహారం, ఆరోగ్యం, భద్రత, సదుపాయాల నిర్వహణ వంటివన్నీ కంపెనీయే ఏర్పాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో విజయేంద్ర సరస్వతి జీవాను సందర్శించగా నివాసితులు, సిబ్బంది ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఆ ప్రాంగణంలో వున్న శివ, విష్ణు ఆలయాలను, గోశాలను స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో వున్నవారందరికీ స్వామివారు ఆశీస్సులు అందజేయడంతో పాటు భాగవత, రామాయణ, భగవద్గీత, దేవారం వంటి పవిత్ర గ్రంథాలను చదవాలని ప్రోత్సహించారు.

ధాన్యం కొనుగోలులో బ్రోకర్లను అడ్డుకోండి



ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

తిరుత్తణి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణంలోని ప్రభుత్వ గోదాముల్లో ధాన్యం కొనుగోలులో మధ్యవర్తుల అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. కష్టపడి పండించిన ధాన్యంపై ప్రభుత్వం పలు రకాల రాయితీలు కల్పించి రైతులను ఆదుకుంటోందని, అయినప్పటికీ ధ్యాన్యం కొనుగోలు చేసే మధ్యవర్తులు గోదాముల్లో దాన్యాన్ని అన్‌లోడ్ చేసేందుకు తమనుంచి బస్తాకు రూ.15 అదనంగా వసూలు చేస్తున్నారని వాపోయారు. దీని వల్ల క్వింటాకు తమకు వచ్చే ఆదాయాన్ని నష్టపోతున్నట్లు వాపోతున్నారు. ప్రభుత్వ ధాన్యం గోదాముల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉన్నతాధికారుల సమక్షంలో అన్‌లోడ్ చేయించి, అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి



నిరసన తెలుపుతున్న మృతుడి బంధువులు

తిరుత్తణి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట పెరియనాగపూండిలో రమేష్ (42) తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. రాణిపేట జిల్లా షోళింగర్‌లోని టీవీఎస్ షోరూంలో పనిచేస్తున్న రమేష్ సోమవారం ఉదయం షోరూమ్‌లోకి హఠాత్తుగా దూసుకువచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం రమేష్‌ను ఆస్పత్రికి తరలించి అతని కుటుంబ సభ్యులకు షోరూం నిర్వాహకులు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. ఈ వ్యవహారంపై ఆగ్రహించిన రమేష్ కుటుంబీకులు, బంధువులు షోరూం వద్ద తమకు న్యాయం చేయాలని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్తె పవిత్ర మీడియాతో మాట్లాడుతూ, తన తండ్రి మృతిపై తమకు అనుమానాలున్నాయని, ప్రమాదంలో స్వల్పగాయాలయ్యాయన్నారు. అయితే షోరూం యాజమాన్యం తమకు ఫోన్‌చేసి సమాచారం అందించారని, కానీ ఘటనా స్థలంలోనే ఆయన మృతిచెందాడన్నారు. దీనిపై పోలీసులు షోరూం మేనేజర్‌పై, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామన్న హామీతో వారు నిరసన విరమించుకున్నారు. ఇదిలా వుండగా, రమేష్ కుటుంబ సభ్యులకు అక్కడి స్థానిక అన్నాడీఎంకే నేతలు మద్దతు తెలుపుతూ షోరూం నిర్వాహకులతో చర్చించి మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు.

వచ్చే నెలలో కూత్తంబాక్కం బస్టాండు ప్రారంభం

● మంత్రి శేఖర్‌బాబు వెల్లడి



అడయార్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన కూత్తంబాక్కంలో నిర్మిస్తున్న బస్టాండును నవంబరు లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభిస్తారని రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. సీఎండీఏ ఆధ్వర్యంలో స్థానిక తండయారుపేటలో నిర్మిస్తున్న బస్టాండు నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆవడి సమీపంలోని కూత్తంబాక్కం, మహాబలిపురంలో ప్రత్యక బస్టాండు సహా మొత్తం 11 బస్టాండ్లను రూ.350 కోట్లతో నిర్మిస్తున్నారని తెలిపారు. వీటిలో కూత్తంబాక్కం బస్టాండును వచ్చే నెలలో సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఆర్‌కే పురంలో నిర్మిస్తున్న బస్టాండు వచ్చే నెలాఖరు నాటికి ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. పండుగ సీజన్‌లో ప్యారీస్, రాయపురం లలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నట్టు సీఎం దృష్టికి వచ్చిందన్నారు. అందుకే పర్యాటక, జలవనరుల శాఖల అనుమతి మేరకు ఐల్యాండ్ గ్రౌండ్ స్థలాన్ని, దక్షిణ రైల్వే అనుమతితో రాయపురంలో తాత్కాలిక బస్టాండ్లను నెలకొల్పుతామని మంత్రి శేఖర్ బాబు తెలిపారు.

పొంగల్‌కు ఆధునిక వోల్వో బస్సులు



ప్యారీస్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎస్ఈటీసీఎల్) మొట్టమొదటిసారిగా 20 వోల్వో మల్టీ యాక్సిల్ బస్సు సర్వీసులను పొంగల్ సందర్భంగా పరిచయం చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఎస్ఈటీసీఎల్ ఆధ్వర్యంలో 1,080 కిపైగా డీలక్స్, ఏసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ రవాణా సంస్థ నడుపుతున్న బస్సుల్లో వసతులు మెండుగా ఉన్నందు వల్ల ప్రయాణికులు ఈ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ రవాణాశాఖ మొట్టమొదటిసారిగా 20 వోల్వో మల్టీ యాక్సిల్ బస్సులను పరిచయం చేయనుంది. ఒక్కో బస్సు రూ.1.15 కోట్లతో కొనుగోలు చేశారు. ఈ బస్సులో ఒకే సమయంలో 51 మంది కుదుపులు లేకుండా ప్రశాంతంగా ప్రయాణించవచ్చు. పడక, ఏసీ, మొబైల్ ఛార్జింగ్, వైఫై కనెక్షన్ తదితర వసతులు సమకూర్చారు. ఆమ్నీ బస్సులకు దీటుగా కొనుగోలు చేసిన వోల్వో బస్సులు ప్రయాణికులకు సంక్రాంతి పండుగ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

కరూర్ విషాదం

● మృతిచెందిన అక్కా చెల్లెళ్లకు విద్యార్థుల నివాళి



రోదిస్తున్న మృతుల లోకేశ్వరన్

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయ్ ప్రచారంలో అక్కా, చెల్లెలు మృతిచెందగా, వారు చదువుతున్న పాఠశాలలో సహచర విద్యార్థులు వారికి నివాళులర్పించారు. ఆ సమయంలో, మృతుల తమ్ముడు రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. విజయ్ ప్రచార సభలో చిక్కుకుని వేలుచ్చామిపురానికి చెందిన పెరుమాళ్, సెల్వరాణి దంపతుల కుమార్తెలు పళనియమ్మాళ్ (11), కోకిల (6) మృతిచెందారు. రెడ్డిపాళయంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పళనియమ్మాళ్ 6వ తరగతి, కోకిల 3వ తరగతి చదువుతున్నారు. వారి తమ్ముడు లోకేశ్వరన్ (5) అదే పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. త్రైమాసిక సెలవులు ముగిసి సోమవారం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు తొక్కిసలాటలో మృతిచెందడంపై పాఠశాలలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఇద్దరు బాలికల చిత్రపటాలు ఉంచి సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఇద్దరు సోదరీమణుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించిన తమ్ముడు లోకేశ్వరన్ రోదించడంతో, విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా కంటనీరు పెట్టుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు లోకేశ్వరన్‌ను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లారు.

ఆస్పత్రిలో చేరిన ఎంపీ కార్తి చిదంబరం

అడయార్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శివగంగై లోక్‌సభ ఎంపీ కార్తి చిదంబరం మంగళవారం చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయన ఉన్నట్టుండి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు డాక్టర్ సంతోష్ ఆనంద్ సారథ్యంలోని వైద్యుల బృందం చిన్నపాటి ఆపరేషన్ చేశారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని ఆస్పత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ అనిల్ బీజీ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

'డ్రోన్ పైలెట్'గా హిజ్రా



శివాని

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పుదుకోటకు చెందిన హిజ్రా తొలి డ్రోన్ పైలెట్ అయ్యారు. పుదుకోటకు చెందిన హిజ్రా శివాని (40) డిగ్రీ పూర్తి చేసి, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కోవై వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రిమోట్ డ్రోన్ పైలెట్ సెంటర్‌లో నాబార్డ్ ఆర్థిక సాయంతో 'డ్రోన్ పైలెట్' శిక్షణను శివాని పూర్తి చేశారు. అనంతరం, రాష్ట్రప్రభుత్వ నూతన పరిశ్రమ పథకం కింద వ్యాపారం ప్రారంభించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా శివానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేటినుంచి ఆన్‌లైన్‌లో కేసులు

● జిల్లాల కోర్టులకు హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న జిల్లాల కోర్టుల్లో నమోదైన అన్ని కేసులను ఈనెల 8న బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కేసులకు సంబంధించిన పిటిషన్లను, దస్తావేజులను స్కాన్ చేసి కోర్టుల వెబ్ సైట్ చిరునామాలో అప్‌లోడ్ చేసి పంపే విధానాన్ని అమలుపరచడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నందువల్ల హైకోర్టులో ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, రెండు రాష్ట్రాల్లోని జిల్లాల కోర్టుల్లో నమోదైన అన్ని కేసులను 8వ తేదీ నుంచి ఆన్‌లైన్ దాఖలు చేయడాన్ని తప్పని సరిచేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను సమాచార సాంకేతికశాఖ రిజిస్ట్రార్, ఆయా ప్రాంతాల ప్రిన్సిపల్ జడ్జి, జిల్లా జడ్జీలకు జారీచేశారు. ఆన్‌లైన్‌లో పిటిషన్లు దాఖలు చేయడంలో ఇబ్బందులున్నట్లయితే జిల్లాల్లో ఉన్న ఈసేవా కేంద్రాల సంప్రదించవచ్చని ఆ సర్క్యులర్‌లో సూచించారు.

బాంబు బెదిరింపు : టెన్త్ విద్యార్థికి వార్నింగ్

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడిలోని పాఠశాలలో బాంబు ఉంచినట్లు బెదిరించిన, 10వ తరగతి విద్యార్థిని పోలీసులు హెచ్చరించి పంపారు. పోలీసు కంట్రోల్ రూంకు సోమవారం ఉదయం ఫోన్ చేసిన వ్యక్తి, ఆవడిలో ఉన్న పాఠశాలలో బాంబు ఉంచినట్లు పేర్కొని ఫోన్ కట్ చేశాడు. ఈ వ్యక్తి మాట్లాడిన సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా ఆవడి పోలీసులు విచారణ చేపట్టి, ఆవడి కన్నికాపురానికి చెందిన 'శ్రీరామ్ ట్రేడర్స్' అనే చిల్లర దుకాణం నుంచి ఫోన్ వచ్చినట్లు తెలుసుకున్నారు. దుకాణానికి వెళ్లిన పోలీసులు, యజమాని జయకుమార్‌ను విచారించారు. సోమవారం ఉదయం దుకాణానికి వచ్చిన ఓ బాలుడు, తన తండ్రితో అత్యవసరంగా మాట్లాడాలని తెలిపి, జయకుమార్ సెల్‌ఫోన్ నుంచి కాల్ చేశాడు. అనంతరం సెల్‌ఫోన్‌ను ఫ్లైట్ మోడ్ ఉంచి వెళ్లిపోయాడని జయకుమార్ పోలీసులకు తెలిపాడు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా సదరు బాలుడు ఆవడిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నట్లు గుర్తించి, అతని తల్లిదండ్రులను పిలిపించి హెచ్చరించి పంపారు. త్రైమాసిక పరీక్షల అనంతరం సోమవారం పాఠశాలలు ప్రారంభం కాగా, పరీక్షా ఫలితాలు ఇస్తారనే భయంతో ఆ విద్యార్థి ఈ చర్యలకు పాల్పడినట్లు విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు.

ఫైవ్ స్టార్ హోటల్‌లో రేవ్ పార్టీ

● సంగీత దర్శకుడి కుమారుడు సహా 18 మంది అరెస్ట్, విడుదల

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టార్ హోటల్‌లో గది అద్దెకు తీసుకుని మాదక ద్రవ్యాలతో రేవ్ పార్టీ చేసుకున్న వ్యవహారంలో సంగీత దర్శకుడి కుమారుడు, మహిళలు సహా 18 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా ఆహ్వానాలు అందుకున్న వీరు ఈ పార్టీలో పాల్గొన్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. కీల్పాక్కం ఈవీఆర్ రోడ్డులోని స్టార్ హోటల్‌లో కొందరు యువతీ, యువకులు గది అద్దెకు తీసుకుని మాదక ద్రవ్యాలతో పార్టీ చేసుకుంటున్నట్లు మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులకు సమాచారం అందింది. ఆ హోటల్‌పై దాడి చేసిన పోలీసులు, మత్తులో ఉన్న 18 మందిని అదుపులోకి తీసుకుని 4.50 గ్రాముల మాదకద్రావ్యాలు, మూడు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు, 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని ఎగ్మూర్ కోర్టులో హాజరుపరచగా, అందరికి బెయిలు మంజూరు చేస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు.

బాలికకు లైంగిక వేధింపులు

● మహిళా కరాటే మాస్టర్‌కు 20 ఏళ్ల జైలు

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన మహిళా కరాటే మాస్టర్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఓ దంపతులకు ఇద్దరు కుమార్తెలుండగా, వారిలో రెండో కుమార్తె ప్లస్ టూ చదువుతోంది. గత ఏడాది పాఠశాలకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో మహిళా పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. పాఠశాలలో పనిచేస్తున్న 27 ఏళ్ల మహిళా కరాటే మాస్టర్, సదరు విద్యార్థినిని శిక్షణ పేరుతో తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో కరాటే మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని పోక్సో కోర్టులో జరుగుతున్న నేపథ్యంలో, కరాటే మాస్టర్‌పై నేరారోపణలు నిర్ధారణ కావడంతో, ఆమెకు 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎస్.పద్మ తీర్పు వెలువరించారు.

పోలీసు గ్రీవెన్స్‌లో 205 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ నిర్వహించారు. కమిషనర్ అరుణ్ పాల్గొని, అధికారులు, పోలీసులు, హోంగార్డుల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం సహా పలు సమస్యలపై సాయుధ దళానికి చెందిన అసిస్టెంట్ కమిషనర్, 13 మంది సీఐలు, 42 మంది ఎస్ఐలు, నలుగురు కార్యాలయ సిబ్బంది, 146 మంది పోలీసులు వినతిపత్రాలు సమర్పించారు.

కమల్ బర్త్‌డే స్పెషల్‌గా 'నాయగన్' రీ-రిలీజ్


'నాయగన్' కమల్ హాసన్ - శరణ్య

అగ్ర నటుడు, ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమలహాసన్ తన పుట్టిన రోజు వేడుకలను వచ్చే నెలలో జరుపుకోనున్నారు. దీన్ని పుర స్కరించుకుని ఆయన నటించిన హిట్ చిత్రాల్లోని 'నాయగన్'ను నవంబరు 6న రీ-రి లీజ్ చేయనున్నారు. 1987లో వచ్చిన ఈ చిత్రానికి మణిరత్నం దర్శకుడు. ఇళయరాజా సంగీతం అందించారు. ఈ సినిమా ద్వారా హీరోయిన్‌గా శరణ్య వెండితెరకు పరిచయమ య్యారు. ఇతర పాత్రల్లో జనకరాజ్, కార్తీక, నాజర్, ఢిల్లీ గణేష్, నిళల్‌గల్ రవి, విజయన్, ఎంవీ వాసుదేవ రావు తదితరులు నటిం చారు. తొలిసారి విడుదలైనపుడు ఈ సినిమా ఏకంగా 214 రోజుల పాటు ప్రదర్శించారు.

రజినీ కిషన్ హీరోగా 'రజినీ గ్యాంగ్'

రమేష్ భారతి దర్శకత్వంలో రజినీ కిషన్ హీరోగా తెరకె క్కుతున్న చిత్రం 'రజినీ గ్యాంగ్'. దివంగత జైన్ రాజ్ స్థాపించిన మిశ్రి ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై తెరకెక్కుతున్న మూడో చిత్రం ఇది. గతంలో ఈ బ్యానరుపై 'జైహింద్', 'అష్టకర్మ' విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. మూడో చిత్రంగా 'రజినీ గ్యాంగ్'ను నిర్మిస్తున్నారు. రజినీ కిషన్ సరసన దివిక హీరోయిన్. ఇతర పాత్రల్లో మొట్టై రాజేంద్రన్, రామ్‌దాస్, కూల్ సురేష్, కల్లిరాజా తదితరులు నటిస్తున్నారు. ఇందులో బ్లూ అనే శునకం కీలక పాత్రను పోషిస్తోంది. చెన్నై నగర శివారు ప్రాంతాలైన పడప్పై, మరైమలై నగర్ తదితర ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయగా, నిర్మాణాంతర పనులను జరుపుకుం టోంది. ఎస్ఎస్ సతీష్ కుమార్ కెమె రామెన్, ఎంఎస్ జోన్స్ రూపర్ట్ సంగీతం. ఈ సినిమా గురించి దర్శ కుడు రమేష్ భారతి మాట్లాడుతూ... 'ఇది కమర్షియల్, కామెడీ హారర్ మూవీ. ఇప్పటికే విడుదలైన పస్ట్‌లుక్‌కు స్పందన వచ్చింది. నిర్మాణాంతర పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.


'రజినీ గ్యాంగ్'లో దృశ్యం

హిందీ - తమిళ చిత్రాలకు వ్యత్యాసం ఉంది : కాజల్




హిందీ, తమిళ చిత్రా లకు ఎంతో వ్యత్యాసం ఉందని ప్రముఖ హీరోయిన్ కాజల్ అగర్వాల్ అభిప్రాయప డ్డారు. తమిళంలో అనేక చిత్రాల్లో నటించి తన కంటూ గుర్తింపు, క్రేజ్‌ను సొంతం చేసుకున్న కాజల్... కోలీవుడ్‌లో చివరిసారిగా నటించిన చిత్రం 'ఇండియ న్-2'. ప్రస్తుతం బాలీవుడ్ మూవీల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. తెలుగు, హిందీ భాషల్లో అధిక చిత్రాల్లో నటించినప్పటికీ తనకు తమిళంలో కూడా ప్రత్యేక స్థానం ఉందని ఆమె అంటున్నారు. ఈ విషయంపై ఆమె మాట్లా డుతూ... 'నేను నటించబోయే తమిళ చిత్రంపై అధికారిక ప్రకటన త్వరలోనే వెల్లడికా నుంది. అయితే, హిందీ, తమిళ చిత్ర పరిశ్రమలకు చాలా తేడా ఉంది. నాపై వచ్చే అన్ని వదంతులను పట్టించుకోను. వాటి గురించి ఆలోచించాల్సిన పనిలేదు. వ్యక్తిగతంగా విజయ్ అంటే ఎంతో ఇష్టం. ఆయన రాజకీయ రంగ ప్రవేశంపై నా అభిప్రాయాన్ని చెప్పలేను' అని పేర్కొ న్నారు.

ఒకే చిత్రానికి పనిచేయనున్న ముగ్గురు హీరోలు


విజయ్ ఆంటోని, విశాల్, ఖుష్బూ, సుందర్ సి

ఒక చిత్ర నిర్మాణం కోసం ముగ్గురు హీరోలు కలిసి పనిచేయను న్నారు. ఆ ముగ్గురు ఎవరో కాదు. విశాల్, సుందర్ సి, విజయ్ ఆంటోని. సుందర్ సి దర్శకత్వంలో విశాల్ హీరోగా, విజయ్ ఆంటోని సంగీత దర్శకుడుగా కొత్త చిత్ర తెరకెక్కనుంది. విశాల్ - సుందర్ సి కాంబినే షన్‌లో వచ్చిన 'మద గద రాజా' ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. దీంతో వీరిద్దరి కాంబినే షన్‌లో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. దీనిపై చర్చలు కూడా జరిగాయి. అయితే, రెమ్యునరేషన్, సినిమా బడ్జెట్ తదితర అంశాల కారణంగా ఈ చిత్రం చర్చల దశలోనే ఆగిపోయింది. అదే సమయంలో సుందర్ సి, విశాల్ తమ ప్రాజెక్టుల్లో నిమగ్నమైపో యారు. ఈ ప్రాజెక్టులు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో వీరి కాంబినేషన్‌పై మళ్లీ చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాకు విజయ్ ఆంటోని సంగీతం సమకూర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. 'నూరుసామి'తో పలు ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న విజయ్ ఆంటోని స్నేహితులు కోరడంతో కొత్త చిత్రానికి సంగీతం అందించేందుకు ముందుకు వచ్చారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల సమాచారం.

వడలూరు సత్యజ్ఞాన సభలో శింబు


ధ్యానంలో శింబు

అడయార్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరులో ఉన్న సత్యజ్ఞాన సభను హీరో సిలం బరసన్ టీఆర్ అలియాస్ శింబు మంగళవారం దర్శిం చుకున్నారు. ఇక్కడ యేటా తైపూస జ్యోతి దర్శన వేడు కలు వైభవోపేతంగా నిర్వహి స్తారు. ఇక్కడకు వచ్చిన ఆయన గంట పాటు ధ్యానం చేశారు. ఆ తర్వాత సత్యధర్మసాలై, అనైయాఅడుప్పు తదితర ప్రాంతాలకు వెళ్లి స్వామి దర్శించుకున్నారు. ఆ తర్వాత వల్లలార్ మేట్టుకుప్పంలో తిరువరై దర్శనం చేసుకున్నారు. వల్లలార్ నీటితో జ్యోతిని వెలిగించిన నర్కుంకుళి ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు వల్లలార్ మూడు పూటలా అన్నదానం చేశారని, తాను కూడా అదేవిధంగా పేదల ఆకలి తీర్చేలా అన్నదానం చేసే శక్తిని ఇవ్వాలని ప్రార్థించినట్టు హీరో సింబు వెల్లడించారు.

తిరుచెందూర్‌లో వెనక్కి మళ్లిన సముద్రం



పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరు చెందూర్‌లో మంగళ వారం రెండవ రోజు కూడా సముద్రం వెనక్కి మళ్లింది. తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆల యాన్ని ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు సంద ర్శిస్తుంటారు. భక్తులు తొలుత ఆలయం వెనుక ఉన్న సముద్రంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటుంటారు. సహజంగా, అమావాస్య, పౌర్ణమి, అష్టమి, నవమి తదితర విశేష రోజుల్లో తిరుచెందూర్‌లోని సముద్రం వెనక్కి వెళ్లి, కొద్దిసేపటి తర్వాత యథాస్థాయికి చేరుకుంటుంది. పౌర్ణమి రోజు కావడంతో సోమవారం ఉదయం తిరుచెందూర్ సముద్రం సుమారు 60 మీటర్ల వరకు వెనక్కి వెళ్లింది. ఈ నేపథ్యంలో, మంగళవారం రెండవ రోజు కూడా సముద్రం సుమారు 100 అడుగుల వెనక్కి వెళ్లింది. దీంతో, అడుగున ఉన్న పాచిపట్టిన బండరాళ్లు, సముద్రపు జీవులు బయటకు కనిపించాయి. సముద్రం వెనక్కి వెళ్లడంతో సాధారణం కావడంతో భక్తులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి దర్శ నానికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత సముద్రం యథాస్థితికి చేరుకుంది.

త్వరలో రెండు సొరంగ మార్గాలు పూర్తి: సీఎంఆర్ఎల్

పెరంబూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండవ విడత మెట్రో రైలు ప్రాజెక్టులో 116.1 కి.మీ దూరం మూడు మార్గాల్లో చేపడుతున్నారు. మాధ వరం - సిరుచేరి సిప్కాట్ వరకు (45.4 కి.మీ) మూడో మార్గం, లైట్ హౌస్ - పూందమల్లి వరకు (26.1 కి.మీ) నాల్గో మార్గం, మాధవరం - షోలింగనల్లూర్ వరకు (44.6 కి.మీ) ఐదో మార్గం అని మూడు మార్గాల్లో 118 మెట్రో రైల్వే స్టేషన్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరు గుతున్నాయి. ఈ క్రమంలో, మూడో మార్గంలో రాయ పేట నుంచి రాధాకృష్ణన్ రోడ్డు (ఆర్కే రోడ్డు) వరకు 908 మీటర్ల దూరం సొరంగమార్గం పనులు గత ఏడాది జూలై 21వ తేది ప్రారంభించారు. ఈ పనుల్లో 'భవాని' యంత్రాన్ని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 900 మీటర్ల మేర పనులు పూర్తికాగా, వచ్చే వారంలో ఈ పనులు ముగిసే అవకాశముంది. ఇక, గ్రీన్‌వేస్ నార్త్- మందవెల్లి వరకు సొరంగ మార్గం ఏర్పాటు పనులను 'నేయల్' యంత్రం ద్వారా చేపడు తున్నారు. ఈ మార్గంలో 762 మీటర్ల దూరంలో ఇప్పటివరకు 753 మీటర్ల వరకు పనులు పూర్తయ్యాయని, మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.


సొరంగ మార్గం పనుల్లో కార్మికులు

సీఎం స్టాలిన్‌తో పోటీ పరీక్షల విజేతల భేటీ


జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో సీఎం

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంస్థలో సభ్యులుగా ఉంటూ అదనపు ప్రతిభాపాటవాలపై శిక్షణ పొందిన వారికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రోత్సాహక నగదు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలోనే ఈ యేడాది జాతీయ, రాష్ట్రీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజేత లుగా నిలిచిన 40 మంది విద్యార్థులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సంద ర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ వారి అర్హతకు సంబంధించిన ఉన్నత మైన ఉద్యోగాలు పొంది సమాజానికి సేవలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో మంత్రి సీవీ గణేశన్, కార్మిక సంక్షేమ ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖల కార్యదర్శి కె.వీరరాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎండీకే అధినేత్రి ప్రేమలతకు మాతృ వియోగం


హంసవేణి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్


హంసవేణి (ఫైల్‌ఫొటో)

- స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల సంతాపం

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత మాతృమూర్తి హంసవేణి(83) మృతి చెందారు. గత కొద్దిమాసాలుగా వృద్ధాప్య సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. మంగళవారం వేకువజాము ఆమె చికిత్స ఫలించక తుది శ్వాస విడి చారు. ఆమెకు ప్రేమలత సహా ఇద్దరు కుమార్తెలు. కుమారుడు సుదీష్ డీఎండీకే నాకయుడిగా ఉన్నారు. హంసవేణి భౌతికకాయాన్ని సాలిగ్రామంలోని నివాసగృ హంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ విషయం తెలియగానే సీఎం స్టాలి న్ సాలిగ్రామానికి వెళ్లి హంసవేణి భౌతికకాయంపై పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఇదే విధంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్, బీజేపీ రాష్ట్ర చీఫ్ నయినార్ నాగేంద్ర న్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, పీఎంకే నేత అన్బుమణి, టీఎంసీ అధినేత జీకే వాసన్ తదితరులు హంసవేణి మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

కావేరి హాస్పిటల్‌లో వృద్ధురాలికి మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేట లోని కావేరి హాస్పిటల్‌లో 83 యేళ్ల వృద్ధురాలికి అరుదైన హృద్రోగ శస్త్రచికిత్స నిర్వహించినట్లు కావేరి ఆస్పత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ట్రాన్స్‌కే థటర్ మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టీఎంవీఆర్) చికి త్సతో గుండె కుడివైపున కుంచించుకుపోయిన కవాటం స్థానంలో కృత్రిమ వాల్వును అమర్చినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సపై వివరాలను డాక్టర్ అనంతరామన్ వివరిం చారు. ఈ సమావేశంలో వైద్యనిపుణులు అరుణ్‌కుమార్ కృష్ణసామి, అనంతరామన్, ఆషిక్ అలీ, మహేష్‌కు మార్, కావేరి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయ్య ప్పన్ పొన్నుసామి తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ అరవిందన్‌సెల్వరాజ్, వైద్యనిపుణులు

సిమ్స్‌లో అరుదైన హృద్రోగ శస్త్రచికిత్స


ఆపరేషన్ తర్వాత కోలుకున్న కేరళ యువకుడికి పుస్తకాన్ని కానుకగా అందజేస్తున్న డాక్టర్ వీవీ బాషి, సిమ్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజు శివసామి

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వడపళనిలోని సిమ్స్ ఆస్పత్రిలో కేరళకు చెందిన 28 యేళ్ల ఇంజనీరింగ్ విద్యా ర్థికి అరుదైన హృద్రోగ శస్త్రచి కిత్స నిర్వహించినట్లు ఆ ఆస్పత్రి హృద్రోగ శస్త్రచికిత్సా విభాగం డైరెక్టర్ డాక్టర్ వీవీ బాషి తెలిపారు. మంగళ వారం ఉదయం ఆస్పత్రి హాలులో ఏర్పాటైన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆ యువ కుడు రెండు నెలలుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ ప్రాణాపాయ స్థితిలో సిమ్స్‌లో చేరాడన్నారు. గుండెలో రెండు రకాల సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యపరీక్షల్లో తేలిందన్నారు. ఈ మేరకు బృహద్ధమని దెబ్బతినడం, దాని కవాటం కుంచించుకుపోవడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైనట్లు నిర్ధారించినట్లు చెప్పారు. ఆ పరిస్థితులలో తన నేతృత్వంలో వైద్య నిపుణులు మహమ్మద్ ఇందీస్, అజు జేకబ్, అరుణ్‌కుమార్ బృందం ఐదు గంటలపాటు ఈ అతిక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వివ రించారు. ఈ శస్త్రచికిత్సల అనంతరం సంపూర్ణంగా కోలుకుని డిశ్చార్జి అయిన యువ కుడిని మీడియాకు ఆయన పరిచయం చేశారు. ఈ సమావేశంలో సిమ్స్ ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజు శివసామి కూడా పాల్గొన్నారు.

అర్ధరాత్రి వాననీటి కాల్వల తనిఖీ


రాయపేట హైరోడ్డులో వాననీటి కాల్వను పరిశీలిస్తున్న ఉదయనిధి తదితరులు

చెన్నై, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన నియోజకవర్గం చేపాక్ - ట్రిప్లికేన్‌లో సోమవారం అర్ధరాత్రి అధికారులతో కలిసి వాననీటి కాల్వ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ నియోజకవర్గం పరి ధిలోని వీబీ రామన్ రోడ్డు, రాయపేట హైకోర్టు, మాసిలా మణి రోడ్డు తదితర రహదారులలో వాననీటి కాల్వలను ఆయన పరిశీలించారు. వాననీటి కాల్వ పనులను వీలై నంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. డిప్యూటీ సీఎం వెంటకార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఎన్. సిట్రరసు, కౌన్సిలర్ కమలా చెళియ న్, అధికారులు ఉన్నారు.

పెరుందురై సిప్కాట్‌లో పనిచేయని శుద్ధీకరణ కేంద్రాలు

- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- 30 గ్రామాల్లో నిరుపయోగంగా పంటభూములు


పెరుందురై సిప్కాట్ ప్రాంగణం

టి.నగర్, ఆంధ్రజ్యోతి

ఈరోడ్ జిల్లా పెరుందురై సిప్కాట్ కాంప్లెక్స్‌లో యేళ్ల తరబడి మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు పనిచేయకపో వడంతో సమీపప్రాంతాల్లోని గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఈరోడ్, తిరుప్పూరు జిల్లాల్లో 30 గ్రామాల్లో లక్షలాది ఎకరాల భూముల్లో భూగర్భ జలాలు కలుషితం కావటంతో పంటలు వేయలేని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఆ సిప్కాట్ చుట్టూ ఉన్న గ్రామాల్లో బోరు బావుల వద్ద 'ఈ బోరు నీళ్లు తాగ టానికి పనికిరావు' అనే హెచ్చరిక బోర్డులు ఉండటాన్ని బట్టి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ నీటి కాలుష్యా నికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమ సంస్థలు సిప్కాట్ కాంప్లెక్స్‌లో ఉన్న పరి శ్రమలపై నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. పెరుందురైలోని సిప్కాట్ పారిశ్రామికాభివృద్ధి కేంద్రం పెరుందురై నగర పంచాయతీ, ఈంగూరు గ్రామ పంచా యతీల పరిధిలో 2700 ఎకరాల్లో వ్యాపించి ఉంది. ప్రస్తుతం ఆ సిప్కాట్ ప్రాంగణంలో 250కి పైగా కర్మాగా రాలున్నాయి. ఇనుము, ఆహార ఉత్పత్తులు, బట్టలు, పరు పులు, స్టెబిలైజర్లు సహా విద్యుత్ వస్తువులు, బాత్రూం పరికరాల తయారీ కంపెనీలు, వస్త్రం, నేత, అద్దకం కర్మా గారాలున్నాయి. ఈ సిప్కాట్‌కు చేరువగా ఉన్న ఈంగూరు పంచాయతీ పరిసర ప్రాంతాల్లో ముకాసిపిడ రియూర్, వరపాళయం, వాయ్‌ప్పాడి తదితర గ్రామపం చాయతీలకు సంబంధించిన గ్రామాల్లోని 37 బోరు బావులు వద్ద 'ఈ బోరు బావుల నీరు తాగేందుకు పనికి రావు' అనే బోర్డులున్నాయి. ఇదే విధంగా సిప్కాట్ ప్రాంగణం నుండి ప్రారంభమయ్యే నల్లా వాగు ద్వారా మురుగునీరంతా పాలతొళువు చెరువులో నిల్వ చేరు తోంది.

సక్రమంగా శుద్ధి చేయడం లేదు : ఈ విషయమై ఉద్యమకమిటీ సమన్వయకర్త, మద్రాస్ ఐఐటీ మాజీ విద్యార్థి ప్రసాద్ మాట్లాడుతూ... 2017 తర్వాత జీరో డిశ్చార్జ్ అనే కఠిన నిబం ధన అమలులోకి వచ్చిన తర్వాత కూడా ఆ కర్మాగారాల నుంచి వెలువడే నీటిని సక్రమంగా శుద్ధి చేయడం లేదని ఆరోపించారు. సిప్కాట్‌లోని అద్దకం, తోలు వస్తువుల తయారీ కర్మాగా రాల నుండి 25 యేళ్లకు పైగా వెలువడిన లవణ శాతం అధికంగా ఉన్న నీటిని విడుదల చేయడం వలన ఈరోడ్, తిరుప్పూరు జిల్లాల్లో 30 గ్రామాల్లో లక్షలాది ఎకరాల భూముల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని వివరించారు.



ఉద్యమ కమిటీ సమన్వయకర్త ప్రసాద్


కెమిస్ట్రీ విద్యార్థిని సెమ్మలర్

బోరు బావి నీళ్లే గతి... : ఈ విషయమై ఈంగూరు గ్రామా నికి చెందిన యువతి సెమ్మలర్ మాట్లాడుతూ కెమిస్ట్రీ చది విన తాను ల్యాబ్‌లో పనిచేస్తున్నానని, ఇటీవల తన ఇంట్లో బోర్‌వెల్ నీటిని సేకరించి ల్యాబ్‌కు పంపి పరీక్షించినప్పుడు అందులో టీడీఎస్, ఫ్లోరైడ్, నైట్రేట్ కూడా పరిమితికి మించి అధికంగా ఉన్నట్లు వెల్లడైందని తెలిపారు. ఫ్లోరైడ్ అత్యధికంగా ఉంటే నోటిలో దంతాలు రాలిపోతాయని, సల్ఫేట్ అధికంగా ఉంటే దేహంలో పలు సమ స్యలు ఎదురవుతాయన్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో రోజూ తాగునీరు సరఫరా కావటంలేదన్నారు. కొన్ని గ్రామాల్లో కొళాయిలలో సరఫరా చేస్తున్న నీటిని అక్కడికక్కడే పరీక్షించినప్పుడు వాటిలో టీడీస్ శాతం 4 వేలకు పైగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు...

సిప్కాట్ ప్రాంగణంలో నిబంధనను అతిక్రమించి పలు కర్మాగారాలు మురుగునీటిని శుద్ధీకరించకుండా సిప్కాట్ ప్రాంగణంలో నల్లా వాగులో విడిచిపెడుతున్నట్లు స్థాని కులు ఆరోపిస్తున్నారు. 2017 తర్వాత జీరో డిశ్చార్జ్ అనే పరిమితిపై అద్దకపు కర్మాగారాలు మురుగునీటికి సంబం ధించిన నిబంధనలు కఠినతరం కావటం, ప్రజల నుండి ఎదురైన వ్యతిరేకతల నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ప్రాంగణంలోని అన్ని తోలు కర్మాగారాలను మూసివేయాలని ఆదేశించింది. అయితే ఆ ఉత్తర్వులవల్ల ఎలాంటి మార్పులు జరగలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తు న్నారు. దీంతో సిప్కాట్‌లోని అద్దకపు పరిశ్రమలు, తోలు పరిశ్రమలు మురుగునీటిని శుద్ధీకరణ ప్లాంట్ల ద్వారా శుద్ధీకరించి విడుదల చేయాలని కోరుతూ ఉద్యమ సంస్థలు ఆందోళనలు చేశాయి. ఇలా ఆందోళనలు చేసిన 42 మందిపై కేసులు నమోదు చేశారు.



కడప్పైమడై వద్ద కొబ్బరితోటకు బోరుబావి నుండి సరఫరా చేస్తున్న పసుపురంగుతో కూడిన జలాలు - రంగుమారిన నల్లా ఓడై

దుస్థితిలో సిప్కాట్...

పెరుందురై సిప్కాట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తే అన్ని వైపులా దుర్గంధం వ్యాపిస్తోంది. పలు కర్మాగారాల నుంచి దట్టమైన పొగ వెలువడుతోంది.. కొన్ని కర్మాగారాల వద్ద నేలబొగ్గు, కట్టెల కుప్పలున్నాయి. ఆ ప్రాంగణంలోనే ఉన్న నల్లాఓడైలో ప్రవహిస్తున్న జలాల్లోనూ లవణ శాతం అధికంగా ఉంది. ఆ వాగు వద్ద అక్కడక్కడా టీడీ ఎస్‌ని కొలిచే పరికరాలు, సీసీ కెమెరాలు కూడా అమ ర్చారు. ఈ విషయమై చీఫ్ ఇంజనీర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సిప్కాట్ ప్రాంగణంలోనే 5 ఎకరాల విస్తీ ర్ణంలో 20లక్షల లీటర్ల మురుగునీటిని శుద్ధీకరించే రీతిలో కొత్త శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణ పనులు జూన్‌లో ప్రారం భమయ్యాయని, , రూ.120 కోట్లతో మురుగునీటి శుద్ధీక రణ కర్మాగారం ఏర్పాటు కానుందని, ఆ ప్లాంట్ ప్రారంభ మయితే నీటి కాలుష్యం సమసిపోతుందని తెలిపారు.







ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి

అవును.. వీళ్లు బతికే ఉన్నారు!



మానవత్వమే సిగ్గుపడే దృశ్యం ఇది. తిరుపతి రుయా ఆసుపత్రికి ఎదురుగా ఇస్కాన్ రోడ్డులోని బస్టాప్‌లో బతికున్న శవాల్లా పడివున్నారు వీరంతా. ఎవరో తెలీదు. ఎక్కడి నుంచి ఎలా వచ్చారో తెలీదు. ఎప్పుడొచ్చి ఈ నీడకు చేరారో ఏమో.. మూలుగుతూ ముక్కుతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. మొన్న ఆరుగురు. నిన్న ఐదుగురు. ఈరోజు రాత్రికి నలుగురు మిగిలారు. వెళ్లిపోయారో, చచ్చిపోయారో తెలీదు. దూసుకుపోయే వాహనాలు.. నడచిపోయే మనుషులు.. ఎవరికీ పట్టని ఈ ప్రాణమున్న శవాలకు మంగళవారం సందెచీకటి వాలేవేళ మందుపూస్తూ, అన్నం పెడుతూ, నీళ్లు తాగిస్తూ అలిపిరి అమ్మగా పేరుపడ్డ సుజాత కనిపించారు. ఈరోజు కన్నుమూసిన వ్యక్తికి పూలమాలవేసి, దణ్ణం పెట్టుకుని ఆమె సాగనంపారు. దివ్యక్షేత్రమైన తిరుమలకు తొలిమెట్టు అయిన అలిపిరిలో ఇది సాధారణ దృశ్యం. పవిత్ర భావనతో శ్రీనివాసుడి దగ్గరకు పయనమయ్యేవారి మనసు వికలమయ్యే చిత్రం. దేవుడిమీద భారం వేసి అలిపిరికి చేరుకుని ఇలా కన్నుమూస్తున్నవారికి జానెడు నీడ, పిడికెడు ముద్ద, రోగానికి మందు ఇచ్చే విశాల హృదయం టీటీడీకి కలిగితే బావుణ్ణు!

– ఆంధ్రజ్యోతి, తిరుపతి

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం :రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,773

తలనీలాలు సమర్పించినవారు: 29,100

పిరమిడ్ పార్టీకి ఎన్నికల కమిషన్ షోకాజు నోటీసులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా వార్షిక ఆడిట్, ఎన్నికల ఖర్చు వివరాలను రాష్ట్రఎన్నికల సంఘానికి సమర్పించకపోవడం వల్ల భారత ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షోకాజ్ నోటీసులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఈ నెల 14వ తేదీ లోపు వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అన్ని రకాల ఆధారపత్రాలతో సహా రాతపూర్వకంగా వివరణ అందజేయాల్సి ఉంటుందన్నారు.

మాజీ ఆర్డీవోకు రెండ్రోజుల పోలీస్ కస్టడీ

చిత్తూరు లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ కోర్టు రెండ్రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించారు. మదనపల్లెలో జరిగిన ఫైల్స్ దహనం కేసులో గతనెల 19వ తేదీన మురళిని సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మురళిని పోలీస్ కస్టడీకి అనుతించాలంటూ సీఐడీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు పూర్తయ్యాక.. మురళిని బుధ, గురువారాల్లో పోలీసుకస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి షేక్ బాబా జాన్ ఆదేశాలు జారీ చేశారు.

'పల్లినేని' కుటుంబానికి లోకేశ్ పరామర్శ



సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి లోకేశ్

పాకాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం గడ్డంవారిపల్లెకు చేరుకున్నారు. సుబ్రహ్మణ్యం నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం భార్య మునిలక్ష్మి, కుమార్తెలు రేవతి, మేఘన, తల్లిదండ్రులను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్రహ్మణ్యం నాయుడు పార్టీకి చేసిన సేవలను శ్లాఘించారు. ఈ సందర్భంగా అక్కడ గ్రామస్తులను పలకరించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామరిస్తున్న మంత్రి

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● కారు సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

మంగళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో మంగళవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 13 ఎర్రచందనం దుంగలును స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డికి అందిన సమాచారం మేరకు.. మంగళవారం తెల్లవారుజాము నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో పులిచెర్ల వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం 10.30గంటలకు పులిచెర్ల వద్ద ఏపీ 39 ఎల్ జెడ్ 9951 నెంబరు గల కారు వేగంగారావడాన్ని అధికారులు గుర్తించారు. కారును ఆపేందుకు ప్రయత్నించగా.. వేగంగా వెళ్లిపోయింది. దీంతో వాహనాన్ని వెంబడించారు. డ్రైవర్ గుడిపల్లి గ్రామం సమీపంలో కారు ఆపి పారిపోయాడు. అధికారులు కారును పరిశీలించగా 13 ఎర్రచందనం దుంగలున్నాయి. పట్టుబడిన వాహనం, దుంగల విలువ రూ.18.64 లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మూగజీవాలకు 'సూపర్' సేవలు

తిరుపతిరూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పశు వైద్య రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. వివిధ వ్యాధులను గుర్తించడమే కాకుండా ఆధునిక పద్ధతుల్లో చికిత్సనూ అందిస్తున్నారు. ఇలాంటి వినూత్న వైద్య సేవలకు కేంద్రంగా నిలుస్తోంది ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశు వైద్య చికిత్స సముదాయ(వీసీసీ)విభాగం. పశువులకు వచ్చే ఎన్నో వ్యాధులకు ఇక్కడ చక్కని పరిష్కారం చూపుతున్నారు.



నేటి నుంచి జాతీయ సదస్సు

వీసీసీ ఆధ్వర్యంలో శాస్త్రీయపరమైన పశువిజ్ఞానాన్ని, అనుభవాలను విద్యార్థులకు అందించేందుకు బుధవారం నుంచి రెండ్రోజులపాటు కళాశాల ఆడిటోరియంలో క్లినికల్ కేస్ వెటర్నరీ స్టూడెంట్స్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం. ఇందులో 14టెక్నికల్ సెషన్స్ ఉంటాయి. వివిధ ఆస్త్రాల నుంచి యూజీ,పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొంటున్నారు. సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల క్లినికల్ ఎక్స్‌పోజర్, నైపుణ్యత ప్రదర్శనకు చక్కని సదస్సు వేదికవుతుంది.

– డాక్టర్ వి.వైకుంఠరావు, వీసీసీ హెడ్

అబ్బురపరిచే ఆధునిక వైద్యం

వీసీసీలో అధునాతన పరికరాలతోపాటు ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటర్, వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రయోగశాల, పెద్ద, చిన్న జంతువుల ఇన్‌పేషంట్ సౌకర్యం, ఆక్వాలిఫ్ట్ లాంటి సదుపాయాలున్నాయి. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకే కాదు గుర్రాలు, చిరుతలు, సింహాలు, ఏనుగులు, పక్షులకు కూడా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నారు. పెంపుడు జంతువులకు రక్తపరీక్షలు, ఎక్స్‌రే, శస్త్రచికిత్సలు, ఇతర పరీక్షలకు రుసుము చెల్లించాలి. వీసీసీలో చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. 2008లో ఈవిభాగం టీచింగ్ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటై 2019లో వీసీసీగా మార్పు చెందింది. తిరుపతి తాతయ్యగుంటలోని సీటీవెటర్నరీ ఆసుపత్రి, తొండవాడలో వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లోనూ పశువైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాదు యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల క్లినికల్ శిక్షణకు ఇది ప్రధానకేంద్రంగా నిలిచింది. రాయలసీమజిల్లాల్లో పశువైద్యానికి సంబంధించి అత్యవసర కేసులకు రిఫెరల్ గానూ కీలకభూమిక పోషిస్తోంది. కేంద్రంలో రోజూవందకు పైగా ఓపీ సేవలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



వీసీసీ భవనం



సీఎంను కలిసి వినతులు ఇచ్చేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు



మానసిక వైకల్యమున్న ఈ పదేళ్ల చిన్నారి పేరు ప్రత్యూష. నాయుడు పేట పట్టణం. తల్లిదండ్రులు లేని ఆమె.. పెద్దనాన్న సంరక్షణలో ఉంది. 90 శాతం వైకల్యమున్నా పూర్తి పెన్షన్ అందడం లేదు. దీనిపై నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేయగా.. రూ.15 వేల పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

జనం వెతలు వింటూ..

● పరిష్కారానికి హామీలిచ్చిన సీఎం

చంద్రగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు మంగళవారం ఉండింది మూడు గంటలే. ఆయన వచ్చింది సోదరుడి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొనేందుకు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తనకోసం వచ్చిన జనం వెతలు ఓపిగ్గా ఉన్నారు. అరగంటకుపైగా వారితో మాట్లాడారు. వినతులు స్వీకరించారు. అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా చంద్రబాబుకు ఎ.రంగంపేట హెలిప్యాడ్ వద్ద స్వాగతం.. వీడ్కోలు పలికారెందరో. వీరిలో సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, మురళీమోహన్, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు హేమలత, సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి, రవినాయుడు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివం, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, పరసారత్నం, మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, డీఐజీ షిమోషీ వాజ్పేయి, ఎస్పీ సుబ్బరాయుడు, డీపీవో సుశీలాదేవి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కర్ణాటక ముఠా

● చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడేది కర్ణాటక గ్యాంగ్ అని పోలీసులు గుర్తించారు. వీరు నగరాన్ని షెల్టర్ జోన్‌గా చేసుకుని చైన్ స్నాచింగ్‌ల నుంచి ద్విచక్ర వాహనాలు చోరీ చేయడం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మహిళలు, వృద్ధుల బ్యాగులు ఎత్తుకెళ్లి ఆభరణాలు, నగదు కొట్టేస్తున్నారని తెలిసింది. వీరు ఆరు నెలలకు ఒకసారి తాము ఎంచుకున్న ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ముఠాల కోసం జిల్లా పోలీసులు ఆరేడు నెలలుగా గాలిస్తున్నారు. తిరుపతిలో కర్ణాటకకు చెందిన దాదాపు 10 గ్యాంగుల సభ్యులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. రెండు రోజుల తిరుపతిలో క్రితం తిరుపతిలోని పోస్టల్ కాలనీలో ఒకరు.. అలిపిరి పరిధిలోని నలుగురు మహిళల మెడల నుంచి దాదాపు 186 గ్రాముల బంగారు చైన్లు లాక్కొని పరారయ్యారు. ఈ పనికి పాల్పడింది కర్ణాటక ముఠానే అని తాజాగా భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి రూరల్ పరిధిలోని చిగురవాడలో ఇద్దరు మహిళల మెడల నుంచి చైన్లు లాక్కెళ్లారు. వీరు స్థానికంగా ద్విచక్ర వాహనాలు దొంగిలించి, ఇలాంటి నేరాలకు పాల్పడుతుండటంతో పోలీసులు తొలుత స్థానికులే ఈ పనికి పాల్పడినట్లు భావించారు. కానీ, విచారణలో కర్ణాటక గ్యాంగు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు చైన్ స్నాచింగ్ నేపథ్యంలో వాకింగ్ వెళ్లే మహిళలు ఆందోళన చెందుతున్నారు. వాకింగ్ సమయంలో విలువైన ఆభరణాలు వేసుకెళ్లొద్దని పోలీసులూ సూచిస్తున్నారు. ఈ ముఠాపై నిఘా పెట్టామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని ఓ పోలీసు అధికారి చెప్పారు.



క్యూలైన్‌లో దర్శనానికి వేచివున్న సర్వదర్శన భక్తులు



ఆక్టోపస్ భవనం సర్కిల్ వద్ద సర్వదర్శన అదనపు క్యూలైన్‌కు అడ్డుగా పెట్టిన బారికేడ్

తిరుమలలో అదే రద్దీ

తిరుమల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తమిళులు అత్యంత పెరటాశి మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. తమ స్వగ్రామాల నుంచే తిరుమలకు కాలినడకన చేరుకుని స్వామిని దర్శించుకునే సంప్రదాయం ఉంది. సెప్టెంబరు 17వ తేదీన పెరటాశి మాసం ప్రారంభమైనప్పటికీ 25వ తేదీ వరకు భక్తుల రద్దీ మోస్తరుగానే కనిపించింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన 24వ తేదీతో పాటు 25 తేదీలు వీఐపీల హడావుడితో కనిపించిన క్షేత్రం.. 26 నుంచి మాత్రం భక్తులతో రద్దీగా మారిపోయింది. 27 పెరటాశి రెండో శనివారంతో పాటు మరుసటి రోజు 28న గరుడవాహనం కావడంతో ఆ మూడురోజులు తిరుమల కిటకిటలాడింది. ఆ రద్దీ ఇప్పటికీ కొనసాగుతోంది. సర్వదర్శన క్యూలైను ఆక్టోపస్ భవనం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపిస్తోంది. అర్థరాత్రి దాటాక కూడా భక్తులు క్యూలైన్‌లోకి చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత బాటగంగమ్మ ఆలయ సర్కిల్ సమీపంలోని క్యూలైన్‌కు తాళం వేయాల్సి వస్తోంది. ఇక, అదనపు క్యూలైన్ ప్రవేశమైన అక్టోపస్ భవనం సర్కిల్ వద్ద బారికేడ్‌ను క్యూలైన్‌కు అడ్డుగా పెడుతున్నారు. తిరిగి అర్థరాత్రి తర్వాత భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు.

- 12 రోజుల్లో 8.9 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు.
- అత్యధికంగా 4న 83,380.. 5న 83,412 మంది దర్శించుకున్నారు.
- 11 రోజుల్లో 37.32 కోట్ల హుండీ ఆదాయం లభించింది.
- 3,33,234 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.



క్యూలైన్‌లోకి వెళ్లేందుకు పరుగులు తీస్తున్న భక్తులు



పట్టుబడిన స్మగ్లర్లు, వాహనం, దుంగలతో ఉద్యోగులు

ఎర్రచందనం పట్టివేత

భాకరాపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్మగ్లర్లతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భాకరాపేట-తలకోన మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో పూలకుంటపల్లె రోడ్డు వద్ద నిఘా పెట్టామన్నారు. ఈక్రమంలో ఓ కారును ఆపగా తమిళనాడుకు చెందిన చందురిస్ యజుమల్లై, తరుమాన్ సామిక్కన్ అనే స్మగ్లర్లు పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి పట్టుకుని కారును తనిఖీ చేయగా ఆరు ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయన్నారు. స్మగ్లర్లపై కేసు నమోదు చేసి వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందని ఆయన తెలిపారు. దాడిలో ఎఫ్ఎస్‌వో సలావుద్దీన్, ఎఫ్‌బీవోలు రాజేశ్ కుమార్, ప్రదీప్ చంద్, రవి, సిబ్బంది శంకర్ రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు వివరించారు.

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని స్విమ్స్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతికి మూలస్తంభంగా నిలిచిందన్నారు. యువత వాల్మీకి జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.